ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-09-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

-  రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.
-  అమరావతి క్వాంటం బయో వ్యాలీ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందని కేంద్రమంత్రి జే.పీ. నడ్డా భరోసా ఇచ్చారు.
-  రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం బిసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని మంత్రి ఎస్.సవిత తెలిపారు.
-  అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాబోయే 24 గంటల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

====================

రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. విజయవాడలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కళావేదికలో రాష్ట్రవ్యాప్తంగా10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. 500 పడకలతో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, తద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు గణనీయంగా ఖర్చు తగ్గుతుందని చెప్పారు. సంజీవని ప్రాజెక్ట్ ఆరోగ్య రంగంలో కీలక పాత్ర పోషించబోతుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంతో చాలామందికి ప్రయోజనం చేకూరుతోందని, అర్హులైన వారికి 5 లక్షల రూపాయల ఆరోగ్య బీమా వర్తిస్తుందని స్పష్టం చేశారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ ప్రథమ స్థానంలో ఉండాలని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

====================

అమరావతి క్వాంటం బయో వ్యాలీ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందని కేంద్రమంత్రి జే.పీ. నడ్డా భరోసా ఇచ్చారు. విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కలసి రాష్ట్రవ్యాప్తంగా క్రిటికల్ కేర్ బ్లాకులు, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జే.పి.నడ్డా మాట్లాడుతూ.. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుపై చర్చించేందుకు.. కేంద్ర సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 1,271 కోట్ల రూపాయలతో 24 క్రిటికల్ బ్లాకులు, 25 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, 33 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు నిర్మించబోతున్నామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని కొనియాడారు. వచ్చే ఐదేళ్లలో 64 వేల కోట్ల రూపాయలతో ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయబోతున్నామని కేంద్రమంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్…29 సెకన్లు)

====================

శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 23 కోట్ల 75 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించడం పట్ల కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈ బ్లాక్ అందుబాటులోకి రావడంతో అత్యవసర, క్లిష్ట పరిస్థితుల్లో చికిత్స అందించే ఆసుపత్రి సామర్థ్యం మరింత పెరుగుతుందని చెప్పారు.

====================

విరామం

====================

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్ లో మంత్రి సవిత ఆధ్వర్యంలో బీసీ రక్షణ చట్టంపై ఈరోజు అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. బీసీల ఆత్మ గౌరవం కాపాడటం ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు కూటమి ప్రభుత్వంతో మాత్రమే సాధ్యమని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ బీసీ రక్షణ చట్టం అమలు చేస్తామని తెలిపారు. బీసీ రక్షణ చట్టాన్ని కోర్టుల్లో నిలబడేలా సిద్ధం చేస్తున్నామన్నారు. బీసీలను అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన నిలబెడతామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్…30 సెకన్లు)

====================

అనంతపురం జిల్లాలో 9వ జాతీయ పోషణ్ మాసోత్సవ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఈరోజు ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండలం శివరాంపేట గ్రామంలో పోషణ మహోత్సవ కార్యక్రమాలు జరిగాయి. అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరవకొండ స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ శ్రీదేవి మాట్లాడుతూ.. మాసోత్సవాలలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పోషణ అభియాన్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

====================

గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పోలీసులకు దిశానిర్దేశం చేశారు. పలు జిల్లాల ఎస్పీలతో హోం మంత్రి అనిత సచివాలయంలో టెలికాన్ఫరెన్స్ ద్వారా ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణపై అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ ఉత్సవాల అనుమతుల కోసం అమలు చేస్తున్న సింగిల్ విండో విధానంపై ఉత్సవ కమిటీలకు, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు.

====================

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల డిసెంబర్ నెల కోటాను సెప్టెంబర్ 19వ తేదీన ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొంది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 22వ తేదీ ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు, అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23వ తేదీ ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను ఉదయం 11 గంటలకు ఆన్ లైన్ లో విడుదల చేయనున్నట్లు టిటిడి తెలిపింది. అలాగే వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారి కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు, ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామని టిటిడి ఆ ప్రకటనలో పేర్కొంది.

====================

దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతంలో అల్పపీడనం కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఈరోజు తెలిపారు. ఈ అల్పపీడనం రాబోయే 24 గంటల్లో విదర్భ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే

అవకాశం ఉందని వెల్లడించారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని వివరించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

=====================

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం పార్వతీపురం మన్యం జిల్లా అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. పార్వతీపురం పట్టణం 12వ వార్డు పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో ఈరోజు నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. టీకా కార్డుల్లో గడువు తేదీలను పరిశీలించి, తదుపరి టీకా వేయాల్సిన తేదీలను పిల్లల తల్లులకు తెలియజేసి నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.

=====================

=====================